ప్రజాశక్తి

శుక్రవారం 19 జులై 2024 8 పేజీలు




గుంటూరు



పల్నాడు



పల్నాడు జిల్లా రొంపిచర్లలో రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ర్యాలీ



గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే ఇవ్వాలి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అధికారులకు రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల అర్జీలు

వార్తలు 4, 5 పేజీల్లో

పోస్టింగ్‌లకు పైరవీలు

- మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణం
- బదిలీ అవుతుందని విధులపై దృష్టి పెట్టలేని అధికారులు

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటినా ఆయా శాఖల్లో బదిలీలకు సంబంధించి అస్పష్టత కొనసాగుతోంది. అయితే ఏ సమయంలో అయినా జిల్లా స్థాయి అధికారులకు బదిలీల ప్రక్రియ ప్రారంభం అవుతుందని అధికార వర్గాల్లో ప్రచారం మవుతోంది. ఇప్పటి వరకు ప్రభుత్వం ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై దృష్టి సారించిందని ఇక మీదట ఆయా శాఖల్లో జిల్లా స్థాయి అధికారుల బదిలీపై దృష్టి పెడతారని అధికార వర్గాలు చెబుతున్నారు.

ఇప్పటికే గుంటూరు, పల్నాడు జిల్లాలకు కొత్త కలెక్టర్లు, నూతన ఎస్‌పిలు బాధ్యతలు స్వీకరించారు. రెండు జిల్లాలోజాయింట్ కలెక్టర్లు కూడా ప్రమోషన్లపై కలెక్టర్లుగా ఇతర జిల్లాలకు వెళ్లారు. వీరి స్థానంలో ఇంకా జాయింట్ కలెక్టర్లను ఎవ్వరినీ నియమించ లేదు. ఈ నేపథ్యంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వివిధ శాఖల అధికారులకు త్వరలో బదిలీ ఉంటుందని తెలిసి తమకు అనుకూల మైన స్థానం కోసం పైరవీలు ప్రారంభించారు.

పల్నాడు జిల్లాలో చాలా మంది రెండేళ్లకుపైగా ఒకే స్థానంలో కొనసాగుతు న్నారు. గుంటూరు జిల్లాలో దాదాపు 20 మంది అధికారులు మూడేళ్లకు పైగా ఒక స్థానంలో ఉన్నారు. గత ప్రభుత్వం హయాంలో నియమితులైన అధికారులు కొంతమంది ఏకపక్షంగా పనిచేశారని అధికార టిడిపి నేతలు ఇప్పటికే అసంతృప్తిగా ఉన్నారు. ఎక్కువ మంది జిల్లా అధికారులు 2022 ఏప్రిల్‌లో ఆయా శాఖల్లో నియమితులయ్యారు. జిల్లాలో దాదాపు 70 శాఖల్లో కొత్తగా రెండేళ్ల క్రితం జిల్లా అధికారులుగా బదిలీపై వచ్చారు. వీరిలో ఎక్కువ మంది బదిలీ అవుతారని తెలిసింది.

పల్నాడు జిల్లా 2022 ఏప్రిల్ 4న ఏర్పాటు చేశారు. దాదాపు 70 శాఖల అధికారులు రెండేళ్ల క్రితం పల్నాడు జిల్లాకి బదిలీపై నియమితులయ్యారు. కొన్ని శాఖల్లో సీనియర్

2లో

ఎఎన్‌యు ఇన్‌ఛార్జి వీసీగా ప్రొఫెసర్ గంగాధర్‌రావు

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్‌గా సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ కంచర్ల గంగాధరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సౌరబ్ గౌర్ జీవో ఆర్‌టి నంబర్ 122 విడుదల చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ప్రొఫెసర్ గంగాధరరావు ఇన్‌ఛార్జి వీసీగా విధులు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల వీసీలు రాజీనామా చేసిన నేపథ్యంలో వారి స్థానాల్లో తాత్కాలికంగా పలువురు సీనియర్ ప్రొఫెసర్లను ఇన్‌ఛార్జి వీసీలు ప్రభుత్వం నియమించింది. ప్రొఫెసర్ గంగాధరరావు బాధ్యతలను శుక్రవారం చేపట్టే అవకాశం ఉందని తెలిసింది.

ఇన్‌ఛార్జి వీసీ నేపథ్యమిది..

గుంటూరు జిల్లాలోని తాడికొండ మండలం మోతడకకు చెందిన ప్రొఫెసర్ గంగాధర్‌రావు 1964లో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఎంటెక్ పూర్తి చేసి 1990 నవంబర్ 9న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అధ్యాపక వృత్తిని చేపట్టారు. 2011లో 'ఎనాలసిస్ అండ్ గేమ్ థీరటికల్ అప్రోచ్ ఆఫ్ టిసిపి ఎస్ వై ఎన్ ఫ్లూడింగ్ ఫర్ వెబ్ సర్వర్స్' అంశంపై పిహెచ్‌డి పొందారు. క్లౌడ్ కంప్యూటింగ్, కంప్యూటర్ నెట్‌వర్క్స్, సాఫ్ట్ వేర్ ఇంజినీరింగ్, ఆపరేటింగ్ సిస్టమ్స్, మిషన్ లెర్నింగ్ వంటి అంశాలపై పరిశోధనలు చేస్తారు. ఇప్పటికే 10 మంది ఆయన నుంచి

2లో

రూ.2 లక్షలకుపైగా ఎరువులు, పురుగు మందులు సీజ్

ప్రజాశక్తి-నకరికల్లు : మండలంలోని నర్సింగపాడు, చల్లగుండ్లలోని పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. గుంటూరు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయాధికారి దేవదాసు ఆధ్వర్యంలో ఆయా దుకాణాల్లోని రికార్డులు, నిల్వలను పరిశీలించారు. కాశీ విశ్వేశ్వర ఎరువుల దుకాణంలో నిర్ధిష్ట పత్రాలు లేకుండా ఉంచిన రూ.1.17 లక్షల విలువ చేసే 19.8 టన్నుల యూరియా విక్రయాలను నిలిపేశారు. శ్రీ శ్రీనివాస ట్రేడర్స్‌లో అధమ కంపెనీకి సంబంధించి రూ.84,386 విలువ చేసే 31.5 లీటర్ల పురుగుమందు అమ్మకాలను నిలిపేశారు.





హామీలను విస్మరించి దాడులు..

జనం ఓట్లేసిందే ఇందుకేనా?

వైసిపి ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణానికి చెందిన వైసిపి యువజన భాగం కార్యకర్త షేక్ రషీద్‌ను టిడిపికి చెందిన జిలాని నడిరోడ్డుపై అతి కిరాతకంగా నరికి హత్య చేసిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వైసిపి నేతలు డిమాండ్ చేశారు. ఈ ఘటనలో జిలానీనే పోలీసులు అరెస్టు చేశారని, మిగతా వారినీ అరెస్టు చేయాలని అన్నారు. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో రషీద్ మృతదేహాన్ని ఎమ్మెల్సీలు

2లో



వారిద్దరూ వైసిపి వారే..

మైనార్టీ సంక్షేమం, న్యాయ శాఖ మంత్రి ఎమ్‌డి ఫరూక్

ప్రజాశక్తి-వినుకొండ

హత్యకు గురైన రషీద్, అందుకు పాల్పడిన జిలాని ఇద్దరూ వైసిపి వారేనని, వ్యక్తిగత కక్షల కారణంగా జరిగిన ఈ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయ శాఖ మంత్రి ఎమ్‌డి ఫరూక్ అన్నారు. ఈ ఘటనలో నిందితులకు కఠిన చర్యలు తప్పవని చెప్పారు. వినుకొండకు గురువారం వచ్చిన ఆయన స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రషీద్, జిలాని మధ్య గతంలో ఘర్షణలు జరిగాయని, గత ప్రభుత్వం ఒక గ్రూపును ప్రోత్సహించడం వల్ల తాజా ఘటన జరిగిందని అన్నారు. చిలకలూరిపేట, కర్నూలు, మాచర్ల తదితర ప్రాంతాల్లోనూ ఇలాంటి దాడులు జరిగాయని చెప్పారు. ఇప్పటికీ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా మారలేదని, గత వైసిపి పాలకులతో అంటకాగిన వారే ఉండటం వలన ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. పులివెందుల సంస్కృతిని రాష్ట్రవ్యాప్తంగా తెచ్చిన జగన్ ఇప్పుడు వినుకొండకు ఎందుకు వస్తున్నారని ప్రశ్నించారు. ఏ

2లో

విస్తారంగా వర్షాలు

ముంపు బారిన లోతట్టు ప్రాంతాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గుంటూరు, పల్నాడు జిల్లాలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. తెనాలి, గుంటూరు, మంగళగిరి, పొన్నూరు, తాడేపల్లి, ప్రత్తిపాడు, నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి తదితర ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గుంటూరులో అత్యధికంగా 113.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. డెల్టాలో వెదపద్ధతిలో వరి సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పైరు నీట మునిగి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ పద్ధతిలో వరి సాగు చేసే రైతులు ఇటీవల నారు మళ్లు పోయగా ఇవి కూడా నీట మునిగే పరిస్థితి నెలకొంది. అదేజరిగితే నారు కుళ్లిపోతుందని రైతులు భయపడుతున్నారు. అపరాలు

2లో

లింగంగుంట్ల అగ్రహారం భూముల సమస్య పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

లింగంగుంట్ల అగ్రహారం రైతులు దశాబ్దాలుగా పడుతున్న భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేలా కషి చేస్తానని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం లింగంగుంట్ల రైతులు భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎంపి రాయపాటి సాంబశివరావు సమస్య పరిష్కారానికి ముందుకు వచ్చినా నాడు ఉన్న పరిస్థితుల్లో సాధ్యం కాలేదని,ఇప్పుడు పరిష్కరించేందుకు సాయశక్తులా పని చేస్తానని అన్నారు.అసెంబ్లీ సమావేశాల్లో కూడా చర్చించే ప్రయత్నం చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానన్నారు.జిల్లా జాయింట్ కలెక్టర్ నియమితులు కాగానే దీనిపై చర్చిస్తామన్నారు.

ఇళ్ల పట్టాల పేరిట ప్రజాధనాన్ని కొల్లగొట్టారు

ప్రజాశక్తి- మాచర్ల/విజయపురిసౌత్

ఇళ్ల పట్టాలు పేరు తో వైసిపి నేతలు ప్రజాధనాన్ని కొల్ల గొట్టారని , వారి దగ్గర నుంచి ప్రతి రూపాయి వసూలు చేసి ప్రజా ఖజానాకు జమ కడతామని మాచర్ల ఎమ్మెల్యే జూల కంటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం వెల్దుర్తి మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తక్కువ ధరకు రైతులు వద్ద నుండి భూములు కొనుగోలు చేసి ప్రభుత్వానికి ఎక్కువ ధరకు భూములు అమ్మిన విషయాన్ని శ్వేత పత్రం ద్వారా ఆధారాలతో సహా వెల్లడించడం జరిగిందని అన్నారు. మాచర్లలో ఇళ్ళ పట్టాల అంశంలో జరిగిన అక్రమాలను వెలికితీస్తామని ఎం.ఎల్.ఎ జూలకంటి బ్రహ్మారెడ్డి స్పష్టం చేశారు. బ్రహ్మారెడ్డి ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ తక్కువ ధరకు రైతుల వద్ద నుండి భూములు కొనుగోలు చేసి ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్మకాలు చేసిన అంశాన్ని ఇప్పటికే ప్రభుత్వం వెల్లడి చేసిందన్నారు.

కన్నా లక్ష్మీనారాయణకు రఘురామకృష్ణరాజు పరామర్శ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



ఉండి శాసనసభ్యులు రఘురామ కృష్ణరాజు గురువారం సాయంత్రం సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణతో భేటీ అయ్యారు. ఇటీవల భుజానికి శస్త్రచికిత్స చేయించు కున్న కన్నాను ఆయన పరామర్శించారు. కన్నా ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై కూడా చర్చించారు.



కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా కందుల నాగార్జున పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-మంగళగిరి

తెలుగుయువత గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి కందుల నాగార్జున పుట్టినరోజు వేడుకలను టిడిపి నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీ పోలేరమ్మ గుడి సెంటర్‌లో కేక్‌కట్ చేసి 1000 మందికి పైగా భోజనాలు సమకూర్చారు. నాగార్జునకు పలువురు నాయకులు జ్ఞాపికలు అందించి, సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నాయకులు జి.దుర్గారావు, జి.ధనంజయరావు, ఎ.నాగబాబు, మాజీ కౌన్సిలర్ జంజనం శ్రీనివాసరావు ఉన్నారు.

సిఎం నివాసం వద్ద బందోబస్తు పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా నూతన ఎస్‌పి గా బాధ్యతలు స్వీకరించిన సతీష్ కుమార్ గురువారం సిఎం చంద్రబాబు నివాసం వద్ద, వెలగపూడి సచివాలయం మార్గంలో బందోబస్తును పరి శీలించారు. పోలీస్ అధికారులను, సిబ్బందిని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం కరకట్ట పరిసర ప్రాంతాలను ,తుళ్లూరు సబ్ డివిజన్ పరిధిలోని అసెంబ్లీ సచివాలయం తదితర ప్రాంతాలు సందర్శించారు. అక్కడ విధులు నిర్వ హిస్తున్న పోలీస్ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అసెంబ్లీ చుట్టు పక్కల ప్రాంతాల్లో పర్యటించారు. రానున్న అసెంబ్లీ సమావేశాలు దృష్ట్యా అయా ప్రాంతాలను, భద్రతా ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. అదే సమ యంలో ఇతర జిల్లాల నుంచి వచ్చి తాడేపల్లి ట్రాఫిక్ నిర్వ ర్తిస్తున్న పోలీసు సిబ్బంది వద్దకు ఆయన స్వయంగా వెళ్ళి వారికి అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.

జిల్లా న్యాయమూర్తితో భేటి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారధిని జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్ పిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత పెండింగ్ కేసులను తగ్గించడానికి , లోక్ అదాలత్ ద్వారా కేసులు పరి ష్కారమయ్యే విధంగా న్యాయశాఖ, పోలీసు శాఖలు సమన్వయంతో పని చేసి బాధిత కుటుంబాలకు సత్వర





న్యాయం జరిగేలా కషి చేయటం పై చర్చించారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం అందిం చేలా , పోలీసు శాఖ తరపున కృషి చేస్తామని ఎస్‌పి ఈ సందర్భంగా వివరించారు.

పోలీస్‌అధికారులతో భేటి

జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్‌ను కమ్యూనికేషన్ ఎస్‌పి రాజేశ్వరి, డిఎస్‌పి శివాజీరాజు, ట్రైనీ డిఎస్‌పిలు భానుప్రకాష్, భార్గవి జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

20న సాల్వేషన్ ఆర్మీ ఇండియా సెంట్రల్ టెరిటరీ ప్రారంభ దినోత్సవాలు

పొన్నూరు ఈ బిహెచ్ అడ్మినిస్ట్రేటర్ కెప్టెన్ కె కనక రత్నం

ప్రజాశక్తి -పొన్నూరు

పొన్నూరు ఇవాంజెలికల్ బూత్ హాస్పిటల్ ఆవరణలో ఈనెల 20వ తేదీ శనివారం ఇండియా సెంట్రల్ టెరిటరీ129వ ప్రారంభ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకునేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు పొన్నూరు ఈబిహెచ్ అడ్మినిస్ట్రేటర్ కెప్టెన్ కె.కనక రత్నం తెలిపారు. గురువారం ఆయన ఇండియా సెంట్రల్ టెరిటరీ ఆవిర్భావం గురించి విలేకరులకు వివరించారు. తెలుగు గడ్డపై రక్షణ సైన్యమును స్టాఫ్ కెప్టెన్ అబ్దుల్ అజీజ్, స్టాఫ్ కెప్టెన్ అమీనా భాయ్ దంపతులు ప్రారంభించారు.



అత్యాచార నిందితుడిని అరెస్టు చేయండి

కొత్త రెడ్డిపాలెంలో ఎస్ఎఫ్ఐ క్యాండిల్ ర్యాలీ

ప్రజాశక్తి- చేబ్రోలు

మైనర్ బాలిక అత్యాచార హత్య ఘటన నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వ ర్యంలో గ్రామంలో గురువారం క్యాండిల్ ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సుభాష్ మాట్లాడుతూ రోజులు గడుస్తున్న నిండుతుడిని ఇంతవరకు పట్టుకోకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. ఎక్కువ బలగాలని పెట్టి నిందితుడిని వెంటనే పట్టుకోవాలని డిమాండ్ చేశారు. కుటుంబానికి నష్టపరి హారంగా ప్రభుత్వం పది లక్షల రూపాయలు ఇవ్వాలని,తన అన్నకు చదువు నిమిత్తం అయ్యే ఖర్చులను ప్రభు త్వమే భరించాలని కోరారు. ర్యాలీలో ఎస్ఎఫ్ఐ నాయకులు భాను, శశి, అరవింద్, మణికంఠ, గ్రామంలోని, యువకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టింగ్‌లకు పైరవీలు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు లేకపోవడంతో ఆయా శాఖల్లోని ఇతర విభాగాల్లో పనిచేస్తున్న అధికారుల్ని జిల్లా అధికారులుగా నియమించారు. ఆయా శాఖల పనితీరు రెండేళ్లుగా మంద గమనంగా జరుగుతోంది. ఆయా శాఖల్లో అధికారికంగా ప్రమోషన్లు కల్పించి కొత్త జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని ఆయా శాఖల ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు. పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి, వివిధ శాఖల అధికారులు త్వరలోనే బదిలీ అవుతారని ప్రచారమవుతోంది.

బదిలీ తప్పని సరిగా జరుగుతుందని తెలిసిన అధికారులు ఇప్పటి నుంచే మంత్రుల్ని, వారి అనుచరుల్ని, ఎమ్మెల్యేలను ప్రస్సన్నం చేసుకోవడం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు చెప్పి పరిచయం చేసుకుంటున్న అధికారులు తరువాత తమ మనస్సులో మాటను కూడా వారి అనుచరుల ద్వారా బయటపెట్టి తమవంతు సాయం చేయాలని కోరుతున్నారు. మరోవైపు బదిలీ జరుగుతుందని తెలిసి తమకు అనుకూలమైన జిల్లా, సానుకూలమైన స్థానం కోసం ఎదురుచూస్తున్న అధికారులు స్థానికంగా తమ విధులపై దృష్టి పెట్టలేక పోతున్నారనే వాదన వినిపిస్తోంది. ఎన్నికలకు విధుల కోసం ఇతర జిల్లాలకు వెళ్లిన పలువురు తహశీల్దార్లు, ఎంపీడీవోలు ఇంకా ఉమ్మడి జిల్లాకు చేరలేదు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఎన్నికల విధుల కోసం వెళ్లిన వారు ఇక్కడికి వస్తే ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న వారు తిరిగి వారి స్వస్థలా లకు వెళ్లేందుకు ఎదురుచూస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఫైలు సిఎం చంద్రబాబు వద్ద ఉందనిచ ఆయన ఆమోదిస్తేనే తహశీల్దార్లు, ఎంపీడీవోల బదిలీలు ఉంటాయని చెబుతున్నారు. జిల్లా అధికారుల బదిలీ తరువాత వీరికి పోస్టింగ్‌లకు పచ్చజెండా ఊపవచ్చని తెలిసింది.



19 నుంచి న్యూరోకాన్ సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎపి న్యూరోకాన్ రాష్ట్ర సదస్సు గుంటూరులో జరుగుతుందని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. గురువారం సూపరింటెండెంట్ ఛాంబర్ లో ఆహ్వాన పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్బంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 21 వరకు న్యూరో సైన్టిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సు కు తెలుగు రాష్ట్రాల వైద్యులతో పాటు జాతీయ స్థాయి వైద్యులు కూడా హాజరు అవుతున్నటు చెప్పారు. న్యూరాలజీ, న్యూరో సర్జరీ విభాగాల౧రించి వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందని అన్నారు.

హామీలను విస్మరించి దాడులు..

(మొదటి పేజీ తరువాయి)

మర్రి రాజశేఖర్, లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాసు మహేష్‌రెడ్డి సందర్శించారు. అనంతరం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. 30 రోజుల టిడిపి పాలనలో వైసిపి నాయకులు కార్యకర్తలపై దాడులు పెరిగాయని, ఆ పార్టీకి జనం ఓట్లేసింది ఇందుకేనా? అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధిని, ప్రజలకిచ్చిన హామీల మేనిఫెస్టోను చెత్తకుప్పలో పడవేసి దారుణాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. వైసిపి కార్యకర్తలపై గతంలో జరిగిన దాడిని రషీద్ ఎదుర్కొన్నందుకు ప్రతీకారంగానే ఈ హత్య చేశారని ఆరోపించారు. జిల్లా ఎస్పీ మారగానే ఈ దారుణం జరిగిందన్నారు. కొత్త ప్రభుత్వం రాగానే జరుగుతున్న దాడులకు భయపడి రాష్ట్రవ్యాప్తంగా 20 నుండి 30 వేల మంది గ్రామాలు వదిలి వెళ్లారని అన్నారు.

వారిద్దరూ వైసిపి వారే..

(మొదటి పేజీ తరువాయి)

దేశోద్ధారకుడు చనిపోతే జగన్మోహన్ రెడ్డి పరామర్శకువస్తున్నాడో ప్రజలకు అర్థమవుతుందన్నారు.

బ్రహ్మనాయుడు పాపం, పిఎస్ ఖాన్ స్వార్థానికి రషీద్ బలి : జీవీ

రషీద్ హత్యకు వైసిపి నేతలు రాజకీయ రంగు పులమటం దుర్మార్గమని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. రషీద్, జిలాని ఇద్దరూ వైసిపి నాయకుడు పిఎస్.ఖాన్ అనుచరులని, బొల్లా బ్రహ్మనాయుడు ఒక వర్గాన్ని ప్రోత్సహించడం వల్ల ఈ దారుణం జరిగిందని ఆరోపించారు. రషీద్ హత్యలో బ్రహ్మనాయుడు పాపం ఉందన్నారు. జిలాని ఇంటిపై రషీద్కుఉ చెందిన వారు గతంలో దాడి చేసి కుటుంబ సభ్యులను గాయపరిచి, ద్విచక్ర వాహనాన్ని దహనం చేశారని, దీనిపై జిలాని కుటుంబీకులు వినుకొండ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసిన బ్రహ్మనాయుడు ఒత్తిడితో పోలీసులు పట్టించుకోలేదని అన్నారు.

హత్యతో పార్టీలకు సంబంధం లేదు : శ్రీధర్

వినుకొండలో బుధవారం రాత్రి జరిగిన హత్యకు రాజకీయ పార్టీలకు సంబంధం లేదని దీనికి రాజకీయ రంగు పులిమి వైసిపి శవరాజకీయాలు చేస్తోందని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మలపాటి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తండ్రి చనిపోయినప్పుడు ముఖ్యమంత్రి పదవి కోసం సంతకాలు సేకరణ చేసిన జగన్మోహన్ రెడ్డి, సొంత బాబాయిని అత్యంత కిరాతకంగా హత్య చేయించి రాజకీయ లబ్ధి పొందారని విమర్శించారు.

విస్తారంగా వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

సాగు చేసిన వారు కూడా ఆందోళనలో ఉన్నారు. కాల్వల మరమ్మతులు చేయకపోవడం వల్ల చాలా ప్రాంతాల్లో కాల్వలకు నీరు ముందుకు వెళ్లక పరిసర ప్రాంతాల భూముల్లోకి నీరు చేరి పొలాలు ముంపుబారిన పడుతున్నాయి.

ఎఎన్‌యు ఇన్‌ఛార్జి వీసీగా ప్రొఫెసర్ గంగాధర్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

పరిశోధన డిగ్రీలను పొందగా మరో 12 మంది పిహెచ్‌డిలు చేస్తున్నారు. అండర్ గ్రాడ్యుయేషన్ స్థాయిలోనే శనగల ప్రమీల డిగ్రీ కళాశాల నుంచి బెస్ట్ స్టూడెంట్‌గా అవార్డును పొందారు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా ప్రమోషన్ పొందిన ఆయన విభాగాధిపతిగా, బీఓఎస్ చైర్మన్‌గా, డీన్‌గాను విధులు నిర్వహించారు. వర్సిటీలోని కంప్యూటర్ సెంటర్ విభాగానికి డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ బోధన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

టిడిపి, వైసిపి ఘర్షణ - ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల పం చాయతి పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో బుధవారం అర్ధరాత్రి టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ సంఘట నలో ఇరువర్గాలకు చెందిన ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టిడిపి నాయకుడు బొలమాల ఏడుకొండలు ఇంటిముందు వైసిపి నాయకుడు బొలమాల ఆనందరావు కొడుకు శ్యామ్ సన్ తన ద్విచక్ర వాహనాన్ని ప్రతిరోజూ పార్క్ చేస్తున్నాడు. ఇది అడిగేందుకు వెళ్ళిన ఏడుకొండలను ఆనందరావు భార్య జ్యోతి, శ్యామ్‌సన్‌లు దుర్భాషలాడారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు కర్రలతో పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో టిడిపి వర్గీయులు ఏడుకొండలు, అతని కొడుకులు తిరుపతి రావు, వెంకటేష్‌కు గాయాలయ్యాయి. ఏడుకొండలు అన్న కొడుకు మార్క్ తీవ్రంగా గాయపడ్డాడు. వైసిపి వర్గీయులు ఆనందరావు, జ్యోతి , శ్యామ్ సన్ లు గాయపడ్డారు. గాయపడిన వారిని సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇరువర్గాలపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏడుకొండలు ఫిర్యాదు మేరకు ఆనందరావు,జ్యోతి, శ్యామ్ సన్ , మరికొందరిపై కేసు నమోదు చేశారు. జ్యోతి ఫిర్యాదు మేరకు ఏడుకొండలు, మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





ముప్పాళ్లలోని జెడ్‌పి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

ముప్పాళ్ల మండలంలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి-ముప్పాళ్ల

జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు మండలంలో గురువారం విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ -ఔషధ్ ఆన్ లైన్ లో అప్లోడ్ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం నాటికి పూర్తి చేసి నివేదిక అందించాలనీ సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ ను ఆయన ఆదేశించారు. రిజిస్టర్ లను పరిశీలించి ఎప్పటికప్పుడు రిజిస్టర్లను పూర్తి చేయాలన్నారు. వైద్య సేవలు పొందుతున్న పలువురు పేషంట్లను పలకరించి అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం ముప్పాళ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. అక్కడ మధ్యాహ్న భోజన పథకము అమలు తీరును పరిశీలించారు. భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. భోజన వసతి గురించి, పాఠశాలలో అంది స్తున్న విద్యా బోధన గురించి వివరాలు అడిగి తెలుసు కున్నారు అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్ళి రికార్డులను పరి శీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సేవల ద్వారా అంది స్తున్న సర్వీస్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ పెండింగ్ వివ రాలను అడిగి తెలుసు కున్నారు. సర్వీస్ సర్టిఫికెట్లను ఎప్పటికప్పుడు అందజేయాలని సిబ్బందికి సూచించారు.



ఎంపి వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పత్రికలను, పత్రికాధిపతులను, విలేకరులపై ఎంపి విజయసాయి రెడ్డి కొన్ని రోజుల క్రితం విశాఖపట్నంలో అనుచిత వ్యాఖ్యలు చేయడంపై గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్‌లో జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు, తెలుగుదేశం పార్టీ, సిపిఎం, సిపిఐ, లోక్‌సత్తా, కాంగ్రెస్ పార్టీ నాయ కులు ముందుగా మానవహారంగా ఏర్పడి తమ నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి, డిప్యూటీ తహశీల్దార్ రవిక వినతిపత్రం అందజేశారు.



అక్రమ కేసులు ఎత్తివేయాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఐక్యవేదిక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తి వేయాలని చిలకలూరిపేట తాలూకా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సం ఘం అధ్యక్షులు ఎన్ రాజేశ్వరి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు గురువారం నిరసన ప్రదర్శన చేశారు.

రైతు సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులకు బీమా పరిహారాన్ని అందజేయకుండా గత ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని, రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వమైనా నష్టపోయిన రైతులకు పరిహారం అందించి వారిని ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతుల సమస్యలపై ప్రభుత్వానికి రాయబారం పేరిట ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గురువారం మండల కేంద్రం రొంపిచర్లలో మొదలైన ద్విచక్ర వాహన ర్యాలీ రామిరెడ్డి పాలెం, బుచ్చిపాపన్నపాలెం, గోగులపాడు, గుడిపాడు, రెడ్డిపాలెం, విప్పర్ల,మాచవరం, నల్లగార్లపాడు, పరగటిచర్ల గ్రామాలలో కొనసాగింది. ఆయా సంఘాల నాయకులు వర్షంలో సైతం ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాలలో వినతి పత్రాలు అందజేసి.. సచివాలయాల ఎదుట రైతులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ గత ఏడాది ఖరీఫ్ లో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా కరువు పరిస్థితులు నెలకొని పంటలు ఎండి పోయాయని, రబీలో మిచౌంగ్ తుఫాను కారణంగా పంట నష్టం వాటి ల్లిందని, ఆయా పంటలకు సంబంధించి ఇంత వరకు నష్టపరిహారం అందలేదన్నారు.ప్రస్తుతం సాగుదారులలో 70 శాతం మందికి పైగా కౌలు రైతులే భూములు సాగు చేస్తున్నారని వ్యవసాయం గిట్టుబాటు కాక భూ యజమానులు సాగుకు ముందుకు రావడం లేదని ఈ నేపథ్యంలో సాగుకు ఉపక్రమిస్తున్న కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించి ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలకు రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు గుర్తు చేస్తున్నాయని ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని నష్టపోయిన రైతులను ఆదుకోవడంతో పాటు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి వై,రాధాకృష్ణ మాట్లాడుతూ పెట్టుబడి సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్న అన్నదాతలను ఆదుకోవాలన్నారు. గత ప్రభుత్వం రూ 12,500 రైతు భరోసా కింద ఆర్థిక సహాయం చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించి అధికారంలోకి వచ్చాక రూ.5 వేలు కోత విధించి రైతులకు మొండి చేయి చూపించిందని విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు రూ 20 వేలు ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు సంబంధం లేకుండా ఇవ్వాలని, కౌలు రైతులకు పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విడుదల చేసిన జిఓ నెం. 22 ప్రకారం వ్యవసాయం మోటార్లకు ప్రభుత్వం మీటర్లు బిగించే సందర్భంలో ఆనాడు పోరాటం చేస్తున్న రైతు సంఘాలకు మద్దతుగా యువగళం పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చారని, దీనికి కట్టుబడి జిఓ 22 వెంటనే రద్దు చేయాలన్నారు. 2019 భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేసి ప్రతి కౌలు రైతుకి సిసిఆర్సి కార్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయ నాయక్, రొంపిచర్ల మండలం రైతు సంఘం నాయకులు సరికొండ వెంకటేశ్వరరాజు, ఆయా సంఘాల నాయకులు పలపల రామిరెడ్డి, ఉప్పుటూరు సుబ్బారావు, ప్రజానాట్యమండలి నాయకులు పెద్దిరాజు, బత్తుల బాలకోటయ్య, సిలార్ మసూద్, అంజిరెడ్డి, మస్తాన్‌వలి, అధిక సంఖ్యలో రైతులు కౌలు రైతలు పాల్గొన్నారు.

సచివాలయాల్లో రైతు, కౌలురైతు వ్యవసాయ కార్మిక సంఘాల వినతి



సంతగుడిపాడు గ్రామ సచివాలయంలో వినతిపత్రం ఇస్తున్న ఏపూరి గోపాలరావు, తదితరులు



జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న చిన్నప్ప తదితరులు

ప్రతి కౌలు రైతుకు సిసిఆర్‌సి ఇవ్వండి

కౌలుకు సాగు చేయటమే అర్హతగా భావించి భూమిలేని ప్రతి పేద కౌలు రైతుకు సిసిఆర్సి కార్డులు మంజూరు చేసి బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలని కోరుతూ నరసరావుపేటలోని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ నరసరావుపేట రూరల్ మండలం జొన్నలగడ్డ, ములకలూరు, ఇక్కుర్రు, అల్లూరి వారి పాలెం, పెదరెడ్డి పాలెం గ్రామాలలో కౌలు రైతులకు మద్దతుగా ప్రచారం నిర్వహించామన్నారు .సిసి ఆర్సీ కార్డు పొందిన వారికి భూమిపై ఎటువంటి హక్కులు ఉండవని పంట రుణాలు, పంటల బీమా, సబ్సిడీ వంటి ప్రభుత్వం మద్దతు పొందటానికి మాత్రమే ఈ కార్డు ఉపయోగపడుతుందని భూ యజమానులు అపోహలు వీడి కౌలు దారులకు సహకరించాలన్నారు. సిటీ కోఆర్డినేటర్ సాంబయ్య తోకల, ఏరియా కోఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం పాల్గొన్నారు.

రైతు, కౌలు రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

2023 ఖరీఫ్,రబీ సీజన్లో వర్షాపాతం లేక పంట నష్టపోయిన రైతులకు వాతావరణ బీమా పథకాన్ని వర్తింపజేసి నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామ సచివాలయంలో పంచాయతి కార్యదర్శి శివపార్వతి కి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణ బీమా పథకాన్ని వర్తింపజేసి నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఉపాధి హామీ చట్టం కింద 200 రోజుల పని కల్పించి రూ.600 వేతనం ఇవ్వాలని, తక్షణమే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు తొరటి అమరలింగేశ్వరరావు, ఆలమోతు సుందరయ్య,పంచాయతీ సిబ్బంది సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చాగంటివారిపాలెం గ్రామ సచివాలయంలో పంచాయతి కార్యదర్శి వినతిపత్రం ఇస్తున్న గుంటుపల్లి బాలకృష్ణ

స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపండి

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-క్రోసూరు

అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజనం, వివోఏ తదితర స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులను వెంటనే ఆపాలని అంగన్వాడీ వర్కర్స్ ను హెల్పర్స్ యూనియన్ సిఐటియు పల్నాడు జిల్లా కార్యదర్శి జి.మల్లేశ్వరి అన్నారు. గురువార స్థానిక ఆమంచి విజ్ఞాన కేంద్రంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు క్రోసూరు ప్రాజెక్టు కమిటీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూప్రతిపక్షంలో ఉన్నప్పుడు వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వేధింపులకు గురి చేయడం రాజకీయ పార్టీ లకు పరిపాటిగా మారిందని అన్నారు. రాజకీయ ఒత్తిళ్లను ఆపకపోతే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సిఐటియు జిల్లా నాయకులు జి.రవిబాబు మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో సుమారు 30 మంది అంగన్వాడీ వర్కర్లను ఉద్యోగాల నుంచి తీసివేస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. స్కీమ్ వర్కర్లపై వేధింపులు, ఉద్యోగాల నుంచి వారి తొలగింపులను ఆపని పక్షంలో అందర్నీ ఐక్యం చేసి తీవ్రమైన ఆం దోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడతున్న జి.మల్లేశ్వరి

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - అమరావతి

డయేరియా వ్యాధి రాకుండా ముందుగా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించాలని సిపిఎం కార్యదర్శి బి.సూరిబాబు గురువారం విజ్ఞప్తి చేశారు. గురుకుల పాఠశాలలో విద్యార్థినుల ఆరోగ్య, యోగక్షేమాలు గురించి ప్రిన్సిపాల్‌తో గురువారం ఆయన మాట్లాడారు.పంచాయతి తాగునీటి పైపులు లీకులు రిపేరు చేయించాలని, గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి చెట్లు, మురుగునీటి నిల్వ కారణంగా వాటికి సమీపంలో నివసిస్తున్న స్థానికులు దుర్వాసనతో ఇబ్బంది పడతున్నారని, ఆయా స్థలా యజమానులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేయాలని అధికారులను కోరారు.

సంక్షేమ బోర్డును కొనసాగించాలి

ప్రజాశక్తి - రెంటచింతల: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొన సాగించాలని పల్నాడు జిల్లా నాపరాయి క్వారీ, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు మామిడి పెద్ద సామేలు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను నిలిపివేస్తూ జీవో జారీ చేసి మెమో నెంబరు 1214 అమలు చేసిందని అన్నారు. ఈ మెమో రద్దుచేసి కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు.

భారీగా గోవా మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-ఈపూరు: బొల్లాపల్లి మండలం మర్రిపాలెం గ్రామంలో భారీగా గోవా మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వినుకొండ సెబ్ సీఐ అబ్దుల్ జలీల్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొల్లాపల్లి మండలం మర్రిపాలెంలో మద్యం నిల్వలు ఉన్నాయన్న సమాచారంతో సెబ్ ఎస్ఐ రేవతి సిబ్బందితో దాడులు చేశామన్నారు. డి.ఆంజ నేయులు, నెల్లూరి రమణ, రామవత్ శ్రీను నాయక్, వెం పర్ల సత్యనారాయణను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 458 (180 ఎంఎల్) గోవా మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ సుమారు రూ 1.50 లక్షలు ఉంటుందన్నారు. నిందితులు నలుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

ప్రజాశక్తి
గుంటూరు 5
శుక్రవారం 19 జులై 2024



నిడుముక్కలలో వినతిపత్రం అందిస్తున్న నాయకుల



తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న నాయకుల



దుగ్గిరాలలో వినతిపత్రం అందిస్తున్న నాయకుల

పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే ఇవ్వాలి

రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అర్జీలు





కాజ, చినకాకాని గ్రామాల్లో అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్న ఆయా సంఘాల నాయకులు





ఫిరంగిపురం మండలం పొనుగుపాడు, పెదకాకానిలో వినతిపత్రాలు ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల హామీ మేరకు సాగుదార్లకు పెట్టుబడియం సాయం రూ.20 వేలు వెంటనే అమలు చేయాలని రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. దీంతోపాటు 2023 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో కరువు, తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటలకు పంటల బీమా పరిహారం తక్షణమే రైతుల ఖాతాలలో జమ చేయాలని, రూ.2 లక్షల వరకూ రైతులకు, కౌలు రైతులకు అన్ని రకాల బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే జిఒ 22 రద్దు చేయాలని, భూ యజమాని సంతకం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తదితర డిమాండ్లతో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జిల్లాలోని పలు సచివాలయాల్లో గురువారం వినతిపత్రాలు అందజేశారు. గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డలోని సచివాలయ అధికారికి, రైతు భరోసా కేంద్రం అధికారులకు నాయకులు, రైతులు, వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, నాయకులు ఇ.రామారావు, జొన్నలగడ్డ పంచాయతీ వైస్‌ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, సాంబశివరావు రాధాకృష్ణమూర్తి, బి.రాజారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ

మండలంలోని మోతడక రైతు భరోసా కేంద్రం అధికారిని మెహరూన్, నిడుముక్కల పంచాయతీ కార్యదర్శి సౌజన్యకు వితనిపత్రాలు ఇచ్చారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ బోర్లకు విద్యుత్ మోటార్లు అమర్చేందుకు గత ప్రభుత్వం తెచ్చిన ప్రభుత్వ జి.ఓ.నెం. 22 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పని దినాలను ఏడాదికి 200 రోజులు కల్పించడంతోపాటు కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. పెదవడ్లపూడి హైలెవల్ ఛానెల్ పనులను త్వరితంగా పూర్తి చేసి 26 ఎకరాలకు నీరందించాలని, గుంటూరు ఛానల్ పొడిగింపునకు నిధులు కేటాయించి త్వరితంగా పనులు చేపట్టాలని, కొండవీటి వాగు, గుంటూరు ఛానల్‌లో తూటుకాడ, గుర్రపుడెక్కలను వెంటనే తొలగించాలని కోరారు. ఆంధ్రరత్న పంపింగ్ స్కీం వంటకాల్వను శుద్ధి చేయాలని, విటికె లిఫ్ట్ విద్యుత్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాలవ పంపులను, పంట కాల్వలపై షట్లను మరమ్మతు చేయించాలని, పంట కాల్వాల్లో మేటలను తొలగించాలని కోరారు. తాడేపల్లి మండలం చిర్రావూరులో పశువుల హాస్పటల్‌కు డాక్టర్‌ను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సిహెచ్.భాస్కరరావు బాణావతి భద్రయ్య, జోషి, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని కాజ, చినకాకాని సచివాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ వ్యవసాయ పనులు ప్రారంభమైనా కాల్వలను బాగు చేయలేదని అన్నారు. కాజలో కుక్కల బెడద విపరీతంగా ఉండటం వల్ల చిన్న పిల్లల్ని కరుస్తున్నాయని, వాటి నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. వెంకటరెడ్డి పాలెం అండర్ పాస్ సర్వీస్ రోడ్డు వద్ద కొద్దిపాటి వర్షానికే డ్రెయినేజీ నీటితో చెరువులను తలపిస్తున్నాయని, నీరు క్రిందికి వెళ్ళకపోవడం వల్ల తీవ్రమైన వాసన వస్తోందని, దోమలు వృద్ధి చెంది స్థానికులు రోగాల బారిన పడుతున్నారని వివరించారు. చిన్నకాకానిలో దీన్ దయాళ్ నగర్‌లో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు టి.ప్రసాద్‌రెడ్డి, ఎ.సాంబిరెడ్డి, కె..గోపాల్ రెడ్డి, బ్రహ్మారెడ్డి, బి.సత్యమారెడ్డి, శివయ్య, ఎ.ప్రకాష్‌రావు, జి.బాబూవరప్రసాద్, వి.పూర్ణయ్య, కె.సాంబశివరావు, టి.బ్రహ్మయ్య, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్, దుగ్గిరాల

తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనాధికారి ఎ.జయజయరావు వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, ఉపాధ్యక్షులు ఎం.శివసాంబిరెడ్డి మాట్లాడుతూ దుగ్గిరాలలో కోల్డ్ స్టోరేజీ ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు ప్రభుత్వం తరపున నష్టపరిహారం వెంటనే చెల్లించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జె.బాలరాజు మాట్లాడుతూ ఉపాధి హమీ కూలీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం ఐతానగర్, కఠెవరం, ఎరుకులపూడి, దుగ్గిరాల సచివాలయాల్లో అడ్మిన్లకు వినతి పత్రాలు అందించారు. నాయకులు బి.అమ్మిరెడ్డి, వై.బ్రహ్మేశ్వరరావు, ఎం.సాంబశివరావు, టి.బసురెడ్డి, గోపాలరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని

పెదకానిలో సచివాలయ అడ్మిన్‌కు రైతు, కౌలురైతు సంఘాల నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఎన్.శివాజి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని పొనుగుపాడులో సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. నాయకులు జి.వెంకటేశ్వరరావు, వై.నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, వి.అశోక్, ఎం.అశోక్, జి.లూర్దు, తెలుగు రైతు నాయకులు కె.రాఘవరావు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ సురేష్‌పై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-తాడేపల్లి : మాజీ ఎంపి నందిగామ సురేష్‌కు చెందిన టిప్పర్ లారీ ఢీకొని నాలుగేళ్ల తన మనవడు మరణించాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని తాడేపల్లికి చెందిన తాళ్ల నాగరాజు గురువారం ప్రజాదర్బార్‌లో మంత్రి నారా లోకేష్‌కు అర్జీ అందజేశారు. ఘటన జరిగినప్పుడు పోలీసులు కేసు నమోదు చేసినా ఇతర చర్యలేమీ తీసుకోలేదని, మాజీ ఎంపి సురేష్ పేరు చెప్పి తమను బెదిరించారని వాపోయారు. తప్పుడు దస్తావేజులతో తమ నివాస స్థలాన్ని విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉండవల్లికి చెందిన రాజరాజేశ్వరి ఫిర్యాదు చేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

ప్రజాశక్తి-గుంటూరు : జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా, సీజనల్ వ్యాధులు చెందకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ పటిష్ట ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ త్రాగునీటి సరఫరా, సీజనల్ వ్యాధులు నియంత్రణ, భారీ వర్షాలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు అందించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని, స్టోరేజి ట్యాంకులలో అవసరం మేరకు నీరు నిల్వ ఉండేలా ఇరిగేషన్, పంచాయతీ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అన్నారు. స్టోరేజి ట్యాంకులకు సరఫరా అయ్యే నీటికి, ప్రజలకు సరఫరా చేసే నీటి నాణ్యతను నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం శాంపిల్స్ తీసి పరీక్షలు నిర్వహించాలన్నారు. నిర్దేశించిన స్థాయిలో నాణ్యత లేకపోతే అవసరమైన చర్యలు తీసుకొని సమస్యను సత్వరమే పరిష్కరించాలన్నారు. దోమల వలన వ్యాధులు వ్యాప్తి చెందకుండా అవసరమైన చర్యలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పటిష్ట ప్రణాళిక ప్రకారం పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లోని ఖాళీ ప్రదేశాలలో నీరు నిల్వ ఉండకుండా యజమాన్యాలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. మలేరియా, డెంగీ, సీజనల్ వ్యాధుల బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధులు, దోమల వల్ల వచ్చే వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు విస్తృత స్థాయిలో వైద్య ఆరోగ్యశాఖ, స్థానిక సంస్థల అధికారులు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా విపత్తు నిర్వహణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీకుమారి, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యాన శాఖాధికారి రవీందర్, ఇరిగేషన్ ఎస్ఇ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

జనసేనలోకి ఫిరాయించిన ఇద్దరు వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి - తెనాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెనాలిలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. ఎన్నికల సమయంలోనే ఇద్దరు వైసిపి కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించగా తాజాగా గురువారం మరో ఇద్దరు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో జనసేన పిఎసి చైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో 14వ వార్డు కౌన్సిలర్ (వైసిపి) దాసరి వీరవసంతరావు, 30వ వార్డు కౌన్సిలర్ కొమరాబత్తిని జయపాల్ వైసిపిని వీడి జనసేనలో చేరారు. 29వ వార్డు కౌన్సిలర్ రమావత్ కవితా భాయ్ తండ్రి శ్రీనివాస నాయక్ కూడా జనసేన గూటికి చేరారు. వీరిని మంత్రి మనోహర్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఇదిలా ఉండగా మరి కొంతమంది కౌన్సిలర్లు కూడా ఇదే బాటలో ఉన్నట్లు సమాచారం.



మాట్లాడుతున్న హీరో వరుణ్ సందేశ్

వివిఐటిలో 'విరాజి' చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి - తెనాలి

పెదకాకాని మండలం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం విరాజి చిత్రం యూనిట్ సందడి చేసింది. హ్యాపీడేస్ చిత్రం ఫేమ్ వరుణ్ సందేశ్ హీరోగా తెరకెక్కిన చిత్రం వచ్చేనెల 2న విడుదల కానున్న నేపథ్యంలో చిత్రం యూనిట్ ప్రచార నిమిత్తం కళాశాలకు వచ్చింది. ఈ సందర్భంగా హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ తన కెరీర్లో గుర్తిండిపోయే చిత్రంగా విరాజి ఉంటుందని, ఇటీవల విడుదలైన చిత్రం టీజర్‌కు కూడా విశేష స్పందన లభించిందన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను చిత్రం ఆకట్టుకుంటుందన్నారు. హీరోయిన్ కుషాలిని, నటీనటులు పాల్గొన్నారు. చిత్రానికి ఆద్యంత హర్ష దర్శకత్వం వహించగా, నిర్మాత మహేంద్ర నాథ్ కూండ్ల అని హీరో వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సెల్ఫీలతో సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఈదర పూర్ణచంద్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - తెనాలి

ప్రముఖ సామాజిక కార్యకర్త, హోటల్స్ అసోషియేషన్ రాష్ట్ర నాయకులు, రోటరీ క్లబ్ ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్ పుట్టినరోజు వేడుకలు రాష్ట్ర ఇమానే మజ్లిస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జామియా మసీదు ప్రాంగణంలో తాజ్, బాషా, బప్పు నేతృత్వంలో నిర్వహించిన వేడుకల్లో వెంకట పూర్ణచంద్ భారీ కేకును కట్ చేశారు. వెంకటపూర్ణ చంద్ సేవా కార్యక్రమాలు మరింతగా విస్తరించాలని నిర్వాహక కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. వేడుకలలో ఫరీద్, ఈదర శ్రీనివాస్, గుమ్మడి ప్రసాద్, ఎస్ఎ రహమాన్, దాళ్ల సాయి, బుజ్జి ఖాన్, బాషా ఇర్ఫాన్, సాదిక్ పాల్గొన్నారు.



BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT NARASARAOPET
Dispute. No. 130/2023

Between:
KAPIL CHITS (KOSTA) PVT. LTD., Sattenapalli Branch Represented by its, Legal Officer.
...Disputant

AND

AVULA MASTHAN RAO & Other
...Opponents

To
1. AVULA MASTHAN RAO, S/o. Koteshwar rao A Age:43 years, Occ: Business, ,R/o.H.No 2-12-20, 2nd Line, Barumpet, Narsaraopet, Guntur, District.

Whereas the Disputant has filed the above suit against you for recovery of Chit amount due and the suit was posted on 27-07-2024 Hence, you are hereby informed to appear before this court on 27-07-2024 at 10.00 A.M, either by your self or through your Council. Failing which the matter will be decided Exparte.

// BY ORDER OF THE COURT //
J.SRINIVAS REDDY,
ADVOCATE. Guntur Dist.
NARASARAO PET,

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT NARASARAOPET
Dispute. No. 133/2023

Between:
KAPIL CHITS (KOSTA) PVT. LTD., Sattenapally Branch Represented by its, Legal Officer.
...Disputant

AND

DURGA RAO GARETEPALLI & Other
...Opponents

To
1. DURGA RAO GARETEPALLI, S/o. Bhadraiah, aged about: 46years, Occ: Rte Driver, R/o. 20-2-73/15, venkatapalemcolony,SATTENAPALLI, GUNTU DIST, ANDHRA PRADESH.
2. SRINIVASA RAO VUYYALA, S/O NAGESWARA RAO, aged about 49 years, Occ: Rte Driver, R/o. 4-654, IRUKUPALEM, MUPPALLA MD, GUNTUR DIST, ANDHRA PRADESH.
3. SIVAIAH KANDRAKONDA, S/O KOTESWARA RAO, aged about 53 years, Occ: Rtc Driver, R/o. XXX, VENKATAPATHI COLONY, TIRUPATAMMATALI TEMPLE, SATTENAPALLI, GUNTUR DIST, ANDHRA PRADESH.
4. NAGESWARA RAO THADIBOYINA, S/O ARJUNARAO, aged about 46 years, Occ: Rtc Driver, R/o. 1-3-52, RANGA COLONY, 2WARD, SATTENAPALLI, GUNTUR DIST, ANDHRA PRADESH..

Whereas the Disputant has filed the above suit against you for recovery of Chit amount due and the suit was posted on 27-07-2024 Hence, you are hereby informed to appear before this court on 27-07-2024 at 10.00 A.M, either by your self or through your Council. Failing which the matter will be decided Exparte.

// BY ORDER OF THE COURT //
J.SRINIVAS REDDY,
ADVOCATE.
Guntur Dist.
NARASARAO PET,

అత్యాచారాలకు పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించండి

ప్రజాశక్తి- క్రోసూరు: రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పటికీ దళిత గిరిజన ఆడపిల్లలపై అత్యాచారాలు హత్యలు చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి దాసు, డివిఎంసి నెంబర్ బంక శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఎస్సీ కాలనీలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కేసులపై తక్షణమే హోం శాఖ మంత్రి, ఉప ముఖ్య మంత్రి, ముఖ్యమంత్రి స్పందించి నింది తులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుం బాలకు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. లేని పక్షములో జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

తక్కువ ధరలకే బియ్యం, కందిపప్పు

ప్రజాశక్తి-క్రోసూరు: మండల కేంద్రమైన క్రోసూరు కిరాణ ఓనర్స్ అసోసియేషన్ ద్వారా తక్కువ ధరలకే బియ్యం, కందిపప్పు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ సువర్ణ చుండూరు మల్లి కార్జునరావు (బుజ్జి) షాప్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కేంద్రంలో బియ్యం ఒక రకం రూ.48 మరో రకం రూ.49, కంది పప్పు కిలో రూ.160కు విక్రయించనున్నట్లు తెలిపారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT NARASARAOPET
Dispute. No. 136/2023

Between:
KAPIL CHITS (KOSTA) PVT. LTD., Sattenapalli Branch Represented by its, Legal Officer.
...Disputant

AND

RAVINDRA BABU GUNNEMEDA & Other
...Opponents

To
1. RAVINDRA BABU GUNNEMEDA, S/o. Raghava Rao, aged about: 47years, Occ: Additional Programme Oficer, R/o. JANAKAMMA BUILDING, NAGARJUNA NAGAR COLONY, SATTENAPALLI, GUNTUR DIST, ANDHRA PRADESH.
2. ANANDA MERY GANTELA, S/O RAVINDRA BABU, aged about 44 years, Occ: Rte Conductor, R/o. 20-9-20, NEAR PALA KENDRAM, OLD PONNURU, PONNU RU, GUNTUR DIST, ANDHRA PRADESH..
3. HANUMANTHA RAO KONDAVEETI, S/O GURAVAIAH, aged about 51 years, Occ: Tre Driver, R/o. 2-100, LAKKARAJUGARLAPADU, SATTENAPALLI, GUN TUR DIST, ANDHRA PRADESH
4. KOTESWARA RAO KANDUKURI, S/O VEERA BHADRA CHARI K, aged about 43 years, Occ: RtcDriver, R/o. 7-64, RUDRAVARAM, MUPPALLA, GUNTUR DIST, ANDHRA PRADESH.

Whereas the Disputant has filed the above suit against you for recovery of Chit amount due and the suit was posted on 27-07-2024 Hence, you are hereby informed to appear before this court on 27-07-2024 at 10.00 A.M, either by your self or through your Council. Failing which the matter will be decided Exparte.

// BY ORDER OF THE COURT //
J.SRINIVAS REDDY,
ADVOCATE.
Guntur Dist.
NARASARAO PET,

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT NARASARAOPET
Dispute. No. 131 / 2023

Between:
KAPIL CHITS (KOSTA) PVT. LTD.,Sattenapalli Branch
Represented by its, Legal Officer.
...Disputant

A N D

MEDA SAMBAIAH & Other
...Opponents

To
1. MEDA SAMBAIAH, S/o. Addanki, aged about 48 years, Occ: Business, R/o.H.No.4-130, Near Water Tank, Peda Palakuru Post & Mandal, Guntur District.

Whereas the Disputant has filed the above suit against you for recovery of Chit amount due and the suit was posted on 27-07-2024

Hence, you are hereby informed to appear before this court on **27-07-2024** at **10.00** A.M, either by your self or through your Council. Failing which the matter will be decided Exparte.

// **BY ORDER OF THE COURT** //
J.SRINIVAS REDDY,
ADVOCATE,
Guntur Dist.
NARASARAO PET,
Date: 10-07-2024

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT NARASARAOPET
Dispute. No. 148/2023

Between:
KAPIL CHITS (KOSTA) PVT. LTD., Piduguralla Branch Represented by its, Legal Officer.
AND
..Disputant

RAVINDRA KUMAR NANDIPATI & Other
...Opponents

To
1. RAVINDRA KUMAR NANDIPATI, S/o. Adhi Narayana, aged about: 51 years, Occ:Teacher, R/o. 7-824, PRAJASAKHTI NAGAR 3rd LINE, PIDUGURALLA, GUNTUR, ANDHRA PRADESH
2. SATYA NARAYANA VUTLA, S/O VEERANJANEYULU, aged about 58 years, Occ: Teacher, R/o. 3- 113/A,, MUNGALAVARI VEEDHI, ASRAM BAZAR, PIDUGURALLA, GUNTUR DIST, ANDHRA PRADESH..
3. VIJAYA BABU KARASALA, S/O VEEARAIAH, aged about 57 years, Occ: Teacher, R/o. 15-172, NEMILI REDDY BAZAR,, PIDUGURALLA, GUNTUR DIST, ANDHRA PRADESH.
4. RAMAKRISHNA CHIDUKURI, S/O RAMA RAO, aged about 51 years, Occ: Teacher, R/o. 6-52,,ANUPALEM,, RAJU PALEM (M), GUNTUR DIST, ANDHRA PRADESH.
5 VIJAYA SUNDARA DASS MUKIRAPU, S/o MOSES M, aged about 41 years, Occ: Junior Asst, R/o. 9-299.,, GANDHI NAGAR, PIDUGURALLA, GUNTUR DIST, ANDHRA PRADESH.

Whereas the Disputant has filed the above suit against you for recovery of Chit amount due and the suit was posted on 27-07-2024 Hence, you are hereby informed to appear before this court on 27-07-2024 at 10.00 A.M, either by your self or through your Council. Failing which the matter will be decided Exparte.

// BY ORDER OF THE COURT //
J.SRINIVAS REDDY, ADVOCATE, Guntur Dist.
NARASARAO PET,

'వైసిపి పాలనంతా దోపిడీ, దందాలు'

ప్రజాశక్తి-పెదకూరపాడు: వైసిపి ఐదేళ్ల పాలనలో భూదందాలు, సహజవనరుల దోపిడీ తప్ప ఏమీ జరగలేదని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్వేతపత్రాలను విడుదల చేసిందన్నారు. వైసీపీ పాలకులు ఏ విధంగా దోచుకున్నారో ఆధా రాలతో సహా శ్వేతపత్రాల ద్వారా బయట పెడుతున్నామన్నారు.

చెట్లను అక్రమంగా నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి తాలూకా సెంటర్ లో ప్రధాన రహదారి ప్రక్కన, వందేళ్ల నాటి వేప చెట్టును అక్రమంగానరికిన వారిపై చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉపతహశీల్దార్ ప్రసాద్‌కు వైసిపి నేతలు గురువారం ఫిర్యాదు చేశారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT NARASARAOPET
Dispute. No. 153/2023

Between:
KAPIL CHITS (KOSTA) PVT. LTD., Piduguralla Branch Represented by its, Legal Officer.
...Disputant

AND

SRIKANTH NAIK BANAVATHU & Other
...Opponents

To
1. SRIKANTH NAIK BANAVATHU, S/o. Thulisa Naik, aged about: 29years, Occ: Asst Line Man, R/o. 7-29, SINGARAYA PALEM PILLUTLA POST, MACHAVARAM, GUNTUR, ANDHRA PRADESH..
2. NAGA VENU NAIK BANAVATHU, S/O THULISA NAIK, aged about 28 years, Occ: Asst Line Man, R/o. 7-29, SINGARAYAPALEM THANDA, MACHAVARAM, GUNTUR DIST, ANDHRA PRADESH.
3. KOTESWARA RAO NAIK BANAVATHU, S/O SURYA NAIK, aged about 34 years, Occ: Asst Line Man, R/o. 19-1041/2, RASOOL PETA, PIDUGURALLA, GUNTUR DIST.ANDHRAPRADESH.
4. ASHOK BABU PURAM, S/O PEERAIAH, aged about 32 years, Occ: Asst Lline Man, R/o. XXX, MALLAVOLU.PILLUTLA, MACHAVARAM, GUNTUR DIST, ANDHRA PRADESH.
5 SIVA RAMA KRISHNA REDDY MADIREDDY, S/O VENKATESWARA REDDY aged about 42 years, Occ: Lineman, R/o. 3-494, KONDAMUDU, RAJU PALEM (M), GUNTUR DIST, ANDRA PRADESH

Whereas the Disputant has filed the above suit against you for recovery of Chit amount due and the suit was posted on 27-07-2024 Hence, you are hereby informed to appear before this court on 27-07-2024 at 10.00 A.M, either by your self or through your Council. Failing which the matter will be decided Exparte.

// BY ORDER OF THE COURT //
J.SRINIVAS REDDY,
ADVOCATE,
Guntur Dist.
NARASARAO PET

మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో ..
I.P. No. 24/2024

బిట్వీన్: –
శాఖమూరి దానరావు. .....పిటిషనర్

మరియు

శిఖాకొల్లి వీరాంజనేయులు మరియు ఇతరులు
..... రెస్పాండెంట్స్

To,
R1) శిఖాకొల్లి వీరాంజనేయులు S/o చిన్న వెంకటేశ్వర్లు R/H No: 7-8-45/1, అప్పయ్య వారి వీధి శ్రీరాంపురం, నరసరావుపేట,
R2) అంబటి రామిరెడ్డి S/o లక్ష్మారెడ్డి R/H No: 13-1-326 ఎస్.టి కాలనీ, నరసరావుపేట.

పిటిషనర్ ఇందలి రెస్పాండెంట్ల పైన పై నెం. ఐపి దావా దాఖలు చేస్తూ ఐపి, బి1 షెడ్యూల్‌లో చూపబడిన బడిన ఆస్తులు పైన ఉన్న రిజిస్టర్ డాక్యుమెంటును రద్దు పరచమని మరియు 1వ రెస్పాండెంట్ ను ఇన్సాల్వెంట్ గా ధ్రువీకరించమని పిటీషన్ దాఖలు చేయగా పిటిషనర్ గాక ఇంకా ఎవరికైనా 1,2 వ రెస్పాండెంట్స్ డబ్బు బాకీ ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట ది. 26–07–2024 న ఉదయం 10:30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై వారికి గల అక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల వారి పరోక్షంగా తీర్పు చెప్పబడును.

ఇట్లు
S.G.S.P NAGESWARARAO,
పిటిషనర్ తరపు న్యాయవాది,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT NARASARAOPET
Dispute. No. 151/2023

Between:
KAPIL CHITS (KOSTA) PVT. LTD., Piduguralla Branch Represented by its, Legal Officer.
...Disputant

AND

CH. YAMINI KRISHNA & Other
...Opponents

To
1. YAMINI KRISHNA CHAPARAPU, D/o. Shiva Nagi Reddy, aged about: 28years, Occ: House Wife, R/o. 6-390/5, LINGAM GUNTLA VIDYANAGAR 2ND LINE, NARASARAOPET, GUNTUR, ANDHRA PRADESH.
2. SIVA NAGI REDDY CHAPARAPU, S/O RAMA KRISHNA REDDY, aged about 54 years, Occ: Jr Asst, R/o. 6-390/5, VIDYANAGAR, NARASA RAO PET, GUNTUR DT, ANDHRA PRADESH.
3. VEERA VENKATA PRASAD REDDY GANUGAPANTA, S/O ANJANEYA REDDY G, aged about 51 years, Occ: Railway Head Constable, R/o. 390/3, VIDYANAGAR, NARASARAO PET, GUNTUR DT, ANDHRA PRADESH.
4. ROSAMMA JULAKANTI, W/O BALA MOHAN REDDY J, aged about 50 years, Occ: Teacher, R/o. 7-54, NARASA RAO PET, NARASA RAO PET, GUNTUR DT, ANDHRA PRADESH.
5 PANDU RANGA REDDY BHIMANADHAM, S/O VENKATA SESHA REDDY B, aged about 33 years,Occ: Statistical Programer, R/o. 2-61, VENKATAPURAM, ADDANKI, ADDANKI, ANDHRA PRADESH.

Whereas the Disputant has filed the above suit against you for recovery of Chit amount due and the suit was posted on 27-07-2024 Hence, you are hereby informed to appear before this court on 27-07-2024 at 10.00 A.M, either by your self or through your Council. Failing which the matter will be decided Exparte.

// BY ORDER OF THE COURT //
J.SRINIVAS REDDY,
ADVOCATE,
Guntur Dist.
NARASARAO PET,

ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ప్రజాప్రతి నిధులు క్షేత్రస్థాయి పర్యటనల్లో సంబంధిత అధికారులు కూడా పాల్గొని, పర్యటనలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్‌తో కలిసి, నియోజకవర్గంలో జరుగుతున్న, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మెరుగైన పారిశుధ్యం కోసం చేపట్టాల్సిన చర్యలపై ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ, వారు గుర్తించిన అభివృద్ధి పనుల్లో ఫైనాన్షియల్, నాన్ ఫైనాన్షియల్‌గా విభజన చేసుకొని, నాన్‌ఫైనాన్షియల్ లేదా తక్కువ మొత్తంలో ఖర్చయ్యే ప్యాచ్‌వర్క్స్, తాగునీటి సరఫరా సమస్యలు, కల్వర్ట్స్ నిర్మాణం వంటి వాటిని రోజుల వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. గుంటూరు తూర్పు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

నియోజకవర్గంలో ఇప్పటి వరకూ జరిగిన అభివృద్ధి పనులు, ప్రస్తుతం చేపట్టాల్సిన పనులపై ప్రజాప్రతిని ధులకు వివరించాలన్నారు. నగరంలోని ప్రతి రిజర్వాయర్ పరిధిలో ఎన్ని ట్యాప్ కనెక్షన్‌లు, వాటిలో కమర్షియల్, డొమెస్టిక్ కనెక్షన్ల వివరాలు, రిజర్వాయర్ నుండి ప్రైవేట్ ట్యాంకర్లకు ఇస్తున్న నీటి వివరాలను వారం రోజుల్లో నివేదికివ్వాలని ఎస్‌ఇని ఆదేశించారు. డ్రెయిన్ల వెంబడి, క్రాస్ చేస్తున్న తాగునీటి పైప్‌లైన్‌లు గుర్తిస్తే వాటిని యుద్ధప్రాతిపదికన షిఫ్ట్ చేయాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ నూరుశాతం జరగాలని, లేకుంటే వ్యర్థాలు రోడ్లమీద కాల్వల్లో వేస్తారని అన్నారు. ప్రతిరోజూ చెత్త సేకరణ సమయం కూడా ఆయా ప్రాంత ప్రజలకు తెలియచేయాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల స్థానిక సమస్యలు పరిష్కరించడానికి ప్రతిపాదించిన పనులు వెంటనే చేపట్టాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేకుంటే పనులు చేసినా ప్రజల నుండి విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో తాగునీటి సరఫరా వ్యవస్థపై సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. ప్రతి కాలనికీ తాగునీరు అందించడానికి కృషి చేయాలన్నారు. నియోజక వర్గంలోని జిఎంసి ఖాళీ స్థలాలను గుర్తించి, వాటిలో పార్క్‌లు అభివృద్ధి చేయడానికి, ఇప్పటికే ఉన్న పార్కుల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య పనుల్లో మెరుగుదల ఉండాలని, రోడ్ల మీద వ్యర్థాలు ఉంటే అధికారులు ఎంత పనిచేసినా ప్రజల దృష్టిలో సదాభిప్రాయం కలదన్నారు. ప్రజలు రోడ్ల మీద వ్యర్థాలు వేయకుండా వారికి అవగాహన కల్పించటంతో పాటు, డంపర్‌బిన్ల వద్ద చెత్త నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌ఇ శ్యాంప్రసాద్, ఎంహెచ్‌ఒ మధుసూదన్, ఎడిహెచ్ రామారావు, ఈఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, డిఈఈలు రాము, శ్రీధర్, ఎస్-ఎస్‌లు రాంబాబు, ఆయుబ్ ఖాన్ పాల్గొన్నారు.



గుంటూరు ఎంఇఒ రమణయ్యకు నోబుల్ టీచర్స్ అసియేషన్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు తూర్పు, పశ్చిమ మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన బి.వి.రమణయ్యకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ శుభాకాంక్షలు తెలిపింది. గురువారం కలక్టర్ బంగ్లా రోడ్డులోని ఎంఇఒ కార్యాలయంలో రమణయ్యను అసోసియేషన్ నాయకులు కలిశారు. ఎన్‌టిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ ఖలీ, ఎన్.వి.జగదీష్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి జి.ఆంతోనిబాబు, నాయకులు వి.సతీష్ కుమార్, ఎం.చంద్రశేఖర్, పి.సాయివిశ్వనాథ్ పాల్గొన్నారు.

పాడిరైతులకు సంగం డెయిరీ బోనస్

ప్రజాశక్తి -పొన్నూరు : సంగం డెయిరీకి వచ్చిన లాభాలను పాడి రైతులకే బోనస్ రూపంలో ఇవ్వడానికి డెయిరీ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే డి.నరేంద్ర కుమార్ కృషి చేస్తున్నారని డెయిరీ పాలకవర్గ సభ్యులు బొర్రు రామారావు అన్నారు. మండలంలోని పచ్చలతాడిపర్రులో 70 మంది పాడి రైతులకు రూ.1.97 లక్షలు, గోళ్లమూడి పాడులో 63 మందికి రూ.1.84 లక్షలు, చుండూరు మండలం తొట్టెంపూడిలో 123 మందికి రూ.3.96 లక్షల బోనస్‌ను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రైతులకు ఇన్సూరెన్స్, పశువుల బీమా, పశుగ్రాసం, పశు వైద్యం, డి.వి.సి ఆసుపత్రి వైద్య సేవల గురించి చెప్పారు. తొట్టెంపూడిలో ఆకస్మికంగా మరణించిన పాల ఉత్పత్తిదారుని కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందించినట్లు డెయిరీ మేనేజర్ పి.ఆదినారాయణ తెలిపారు.

'టీచ్ టూల్' మెరుగైన బోధన : ఎంఇఒ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

'టీచ్ టూల్' శిక్షణ ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంఇఒ-1 ఎం.లక్ష్మీనారాయణ అన్నారు. కొత్తపేట సెయింట్ జాన్స్ స్కూల్లో 10 రోజులు పాటు నిర్వహించనున్న థర్డ్ స్పెల్ శిక్షణలో గురువారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష సహకారంతో ఎస్సీఈఆర్టీ బోధనా సాధనాల ఆధారంగా తరగతి గది పరిశీలన అనే అంశంపై మొదటి రెండు స్పెల్స్ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రస్తుత శిక్షణ 28 వరకు ఉంటుందని, తెనాలి డివిజన్ లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఆర్‌ఎంటిలు పాల్గొంటారని తెలిపారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి సాయిప్రసాద్ మాట్లాడుతు విదేశాల్లో బోధనా తరగతులకు దీటుగా పరిశోధనచేసి బోధనలో ఉపాధ్యాయులకు సహకారం అందించేలా శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. ఎంఈఒ-2 వి.జయంతిబాబు మాట్లాడుతూ తరగతిగది బోదనాంశాల్లో పరిశీలన కీలకమైన అంశమన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాల ఆధారంగా తరగతిగదిలో జరిగే బోధనాభ్యాసంపై నిరంతరం పరిశీలన చేయడంద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. కోర్స్ కోఆర్డినేటర్‌గా ఎంఇఒ-1 వ్యవహరించగా వెన్యూ కో-ఆర్డినేటర్‌గా ఎంఇఒ-2 వ్యవరించారు. ఉపాధ్యాయ మెంటర్స్‌గా పి.పద్మ, యు.ప్రసాద్, జివి.బాలసుందర్, ఎం.అభిగయల్, ఎన్.విజయలక్ష్మి, కె.శ్రీమన్నారాయణ, కె.పద్మావతి, బిహెచ్ శ్రీధర్, జె.ప్రకాశరావు, కో-ర్డినేటర్ వీరయ్య వ్యవహరించారు.

డ్రెయినేజీలపై ఆక్రమణలను తొలగించండి : కమిషనర్

ప్రజాశక్తి - పొన్నూరు

పట్టణంలోని పలు కూడలి ప్రాంతాల్లో మేజర్ మురుగు కాల్వలపై అక్రమంగా వేసిన స్లాబులు, నాప రాళ్లను షాపుల యజమానులు, షోరూముల నిర్వాహకులు స్వచ్ఛందంగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ కోరారు. మురుగు కాల్వలపై వేసిన స్లాబులు, బండరాళ్లను, ఆక్రమణలను ఆయన గురువారం పరిశీలించారు. నిడుబ్రోలు, పొన్నూరులోని పలు వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మేజర్ కాల్వల్లో ఆక్రమణదారులు వ్యర్థాలు, ప్లాస్టిక్ సంచులు వేసి, ఇసుకతో పూడ్చటం వల్ల మురుగు నీరు పారుదలవ్వక పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. 8వ వార్డు క్యాబిన్ పేటలో కుప్పకూలిన కల్వర్టు గోడలను పరిశీలించారు. 11, 15 వార్డుల్లో పారిశుధ్యం సరిగా లేకపోవడంతో సిబ్బందిపై



ఆగ్రహం వ్యక్తం చేశారు. 17, 20 వార్డుల్లో, రేపల్లె, గుంటూరు బస్టాండు, ఐలాండ్ సెంటర్లలో రోడ్డుపైకి వచ్చిన వ్యాపారుల దుకాణాలు, తోపుడుబండ్లతో ఆక్రమణలకు గురై ట్రాఫిక్ సమస్య వస్తోందన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 60 ఏళ్ల దాటిన వారంతా అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ చేయించుకోవాలని కోరారు. పరిశీలనలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, 11వ సచివాలయం శానిటరీ సెక్రెటరీ బి.శిరీష పాల్గొన్నారు.

రజక వృత్తిదార్ల సామాజిక రక్షణ చట్టం తేవాలి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టాన్ని వెంటనే తేవాలటని అపార్ట్మెంట్ వాచ్‌మెన్ కం ఇస్త్రీదారుల సంఘం జిల్లా కార్యదర్శి పాగోలు శ్రీనివాసరావు కోరారు. ఈనెల 21న తాడేపల్లిలో జరిగే ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదార్ల సంఘం తాడేపల్లి-మంగళగిరి నగర మహాసభ జయప్రదం కోసం మండలంలోని ఇప్పటంలో గురువారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలప్పుడు కూటమి ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రజక వృత్తిదార్లు తమ శ్రమకు తగిన వేతనాలు అడిగిన సందర్భంలో అగ్రవర్ణ పెత్తందారులు దాడులు చేయడంతోపాటు సాంఘిక బహిష్కరణ చేస్తున్నారని, అక్రమ కేసులు బనాయింస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. పట్టణ ప్రాంతాల్లోనూ అపార్ట్మెంట్ వాచ్మెన్ కం ఇస్త్రీదారులపై దౌర్జన్యాలు అధికమైనట్లు చెప్పారు. రజక మహిళల పైన అత్యాచారం, హత్యలు తదితర దుర్ఘటనలపై రజక వృత్తిదారుల సంఘం సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే బీసీ తరగతులకు సామాజిక రక్షణ చట్టానికి టిడిపి హామీనిచ్చిందని తెలిపారు. 50 ఏళ్లు నిండిన ప్రతి వృత్తిదారుడికి వృద్ధాప్య పింఛను, రజకుల అభ్యున్నతి, సంక్షేమ కార్పొరేషన్‌కు విధివిధానాలు రూపొందించడం జరిగిందన్నారు. రజక వృత్తిదారులను ఆదుకునేందుకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని, లాండ్రీ వృత్తి నిర్వహణకు అవసరమైన విద్యుత్తు నెలకు 200 యూనిట్లు ఉచితంగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వృత్తి



మహాసభ కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

నిర్వహణకు అవసరమైన పనిముట్లు, ఆదరణ పథకం ద్వారా పంపిణీ చేయాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించేందుకు కార్యాచరణలో భాగంగా నిర్వహించే మహాసభను వృత్తిదార్లు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు, నాయకులు పి.లక్ష్మణరావు, ఎం.వెంకటేశ్వరరావు, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఘనంగా డాక్టర్ బిసి రాయ్, ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి

ప్రజాశక్తి-దుగ్గిరాల : ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పిహెచ్‌సిలో డాక్టర్ బిసి రాయ్, ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ అబ్దుల్ రెహమాన్, సి.ఇందిరా, నర్సులను సత్కరించారు. ఈ సందర్భంగా రామస్వామి యాదవ్ మాట్లాడుతూ డాక్టర్ రాయ్ వైద్య, ప్రజా రంగంలో ప్రజలకు చేసిన సేవలను గుర్తించి భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని అందించడంతోపాటు ఆయన పుట్టిన రోజైన జూలై 1వ తేదీ డాక్టర్స్ డేగా ప్రకటించిందన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ సంపన్న కుటుంబంలో జన్మించినా నర్స్ వృత్తిని ఎంచుకొని విశేష సేవలు అందించారని చెప్పారు. ఆమె రచించిన నోట్స్ ఆఫ్ హాస్పిటల్ నోట్స్ ఆఫ్ నర్సింగ్ గ్రంథాలు ఎంతో ప్రాముఖ్యత గలవని చెప్పారు. ఆమె మదర్ ఆఫ్ మోడ్రన్ నర్సుగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో వి.కృప్రసాద్, కె.జోగేంద్ర ప్రసాద్, ఎం.గాంధీ, జె.బాలరాజు, ఎన్.వెంకటేశ్వరరావు, ఎస్.కె సుభాని, కె.నాగయ్య, టి.పూర్ణయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.



చిర్రావూరులో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : మండలంలోని చిర్రావూరు పంచాయతీ కార్యాలయంలో టిడిపి గ్రామ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడ శంకర నేత్ర చికిత్సలయం సహకారంతో నిర్వహించిన శిబిరంలో సుమారు 100 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 20 మందికి ఆపరేషన్ అవసరమని, 30 మందికి కళ్లజోళ్లు అవసమని గుర్తించారు. ఈ సందర్భంగా వీరిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన వచ్చిందన్నారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా కంటి ఆపరేషన్ చేయించుకోవచ్చని అన్నారు. ఈనెల 30వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం మళ్లీ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు లాల్‌చంద్, ఎం.వెంకటేశ్వరరావు, ఎల్.రేవంత్ పాల్గొన్నారు.

నాగులపాడులో నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - పెదనందిపాడు : మండలంలోని నాగులపాడులో శుక్రవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నారు. గ్రామంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ పాలకమండలి వారు సువర్ణ భారతీ మహోత్సవం సందర్భంగా, భారతీ తీర్థ మహాస్వామి 50వ సన్యాస స్వీకరణ మహోత్సవం సందర్భంగా స్థానిక పుట్ట వద్ద కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ చినకోండ్రుపాడు సహకారంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం ఉంటుందని పాలకమండలి అధ్యక్షులు గొల్లపూడి సాంబశివరావు తెలిపారు. కార్డియాలజీ, గైనకాలజీ, ఇఎన్‌టి, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ సేవలు అందుబాటులో ఉంటాయని, షుగర్, బీపీ, ఈసీజీ, 2డి ఎకో టెస్టులు ఉచితంగా చేస్తారని తెలిపారు. పెదనందిపాడు, కాకుమాను, పర్చూరు ప్రాంత ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.



మలినేని కాలేజీలో 'విరాజి' చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి-గుంటూరు

విరాజి చిత్రం ప్రమోషన్‌లో భాగంగా చిత్ర యూనిట్ గురువారం మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో సందడి చేసింది. కార్యక్రమంలో హీరో వరుణ్ సందేశ్, నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల, దర్శకుడు ఆధ్యంత్ హర్ష తదితరులు పాల్గొన్నారు. ఆగస్టు రెండో తేదీన విరాజి చిత్రం విడుదల కాబోతుందని హీరో తెలిపారు.



శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీ ఎదుట పెదగార్లపాడు గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి-దాచేపల్లి

సిమెంట్ ఫ్యాక్టరీ నుండి వెలువడే దుమ్ము తమ ఇళ్లు, పొలాల మీద పడుతోందని, పొలాల్లోని మేతనూ పశువులు తినడానికి వీల్లేకుండా పోయిందని మండలంలోని పెదగార్లపాడు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీ ఎదుట గురువారం నిరసన చేపట్టారు. గ్రామంలోకి దుమ్ము రాకుండా ఫ్యాక్టరీ యాజమాన్యం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే నిరసనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో మాజీ ఎంపిటిసి పరంజ్యోతి, రామారావు, స్థానికులు పాల్గొన్నారు.

హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించాలి

సాంఘిక సంక్షేమ శాఖ డిడికి ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు కోరారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ డిడికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ గుంటూరు నగరంలోని కోడిగుడ్డు సత్రం హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలని, మునిపల్లి ఎస్సీ బాలల వసతి గృహానికి ప్రహరీ నిర్మించాలని కోరారు. గుంటూరు నగరంలోని బీసీ హాస్టల్ స్టడీ చేసేందుకు ఫ్లోరింగ్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు హాస్టల్లో అడ్మిషన్స్‌ను అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. హాస్టల్లో ఫ్యాన్లు లేకపోవటం, మరుగుదొడ్లు సరిపడా లేకపోవటం, ఉన్నవి కూడా అపరిశుభ్రంగా ఉండడం తదితర సమస్యలు ఉన్నాయని చెప్పారు. 10 నెలలుగా మెస్‌ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, హాస్టల్స్‌లో సరిపడా వర్కర్లు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. విద్యార్థులకు సరిపడా గదులు లేవన్నారు. కిటికీలకి మెష్ లేకపోవటం వల్ల దోమలు కుట్టి విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. హాస్టల్‌కి ట్యూటర్లు లేకపోవటం వల్ల విద్యార్థులు ట్యూషన్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. హాస్టల్లోనే ట్యూటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. హాస్టల్ అద్దె భవనాలు అవ్వడం వల్ల 5, 6 నెలల నుండి ప్రభుత్వం అద్దె చెల్లించలేదని, మరుగుదొడ్లు లైట్లు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డీడీ స్పందిస్తూ తన పరిధిలో ఉన్న సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బి.సుచరిత, జిల్లా కమిటీ సభ్యులు ఎ.యశ్వంత్, ఆరిఫా పాల్గొన్నారు.

విద్యార్థిని హత్య కేసులో నిందితుడ్ని శిక్షించాలి

చేబ్రోలు మండలం, కొత్తరెడ్డిపాలెంలో ఏడో తరగతి విద్యార్థినిని అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఇళ్ల స్థలం ఇవ్వాలని, తక్షణమే కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించాలని బాధితురాలి సోదరుడి చదువుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు బి.సుచరిత, జిల్లా కమిటీ సభ్యులు ఎ.యశ్వంత్ ఆరిఫా, దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎంబీబీఎస్ ఫీజులపై మాటమార్చడం సరికాదు : ఎస్ఎఫ్ఐ

107, 108 జీవోల రద్దుకు డిమాండ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గతేడాది ప్రారంభమైన 5 ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 107, 108 జీవోలు రద్దు చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేసి, పాత ఫీజు విధానాన్ని కొనసాగించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పల్నాడు జిల్లా కార్యదర్శి కె.సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. గత ప్రభుత్వం ప్రారంభించిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 5 కళాశాలలకు గత విద్యా సంవత్సరం ఎన్ఎంసి అనుమతులు ఇచ్చిందని, వైసిపి ప్రభుత్వం 3 భాగాలుగా ఫీజును నిర్ణయించిందని వాటిలో బి కేటగిరి (సెల్ఫ్ ఫైనాన్స్) రూ.12 లక్షలు, సి కేటగిరి (ఎన్నారై) రూ.20 లక్షలుగా ఖరారు చేశారని తెలిపారు. ఈ జీవోలను రద్దు చేయాలంటూ అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, జనసేన నాయకులు తీవ్రంగా స్పందించారని గుర్తు చేశారు. ఈ జీవోలను రద్దు చేస్తామంటూ యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ ఇచ్చి ఇప్పుడు గత ఫీజుల పద్ధతినే యథావిధిగా కొనసాగిస్తామంటూ హైకోర్టులో స్పష్టం చేయడం విద్యార్థులను మోసం చేయడమేనని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై పునరాలోచన చేయాలని కోరారు. ప్రతిభగల పేద విద్యార్థులకు కొత్త వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లను కేటాయించాలని, దీనిపై ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే పోరాడతామని స్పష్టం చేశారు.

పాఠశాల, ఆస్పత్రిలో కలెక్టర్ పరిశీలన



ప్రజాశక్తి-తాడేపల్లి

పెనుమాక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖార్ జైన్ పరిశీలించారు. టాయిలెట్లు మరింత పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మరమ్మతులకు గురైన వాటర్ ప్లాంట్‌ను బాగు చేయించాలని, అప్పటి వరకూ మినరల్ వాటర్ తెప్పించాలని హెచ్ఎం రెహమాన్‌కు చెప్పారు. మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం అన్నీ ఇస్తున్నారా? అని అడిగారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పుస్తకాలు, యూనిఫాం విద్యార్థులందరికీ అందించారా లేదా అని అడిగారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పిల్లలకు ప్రాథమిక దశలో అందించే విద్య ఎంతో ప్రాముఖ్యత కలిగిందని చెప్పారు. భావిభారత పౌరులకు ఇది పునాది వంటిదని అన్నారు.

తాడేపల్లి పిహెచ్‌సి పరిశీలన

సీతానగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. రికార్డులు, రిజిష్టర్‌లను పరిశీలించారు. గర్భిణులను గుర్తించి వంద శాతం నమోదయ్యే విధంగా చూడాలన్నారు. 54 మంది గర్భిణులను గుర్తించామని, వీరిలో 26 హైరిస్క్ కేసులున్నాయని డాక్టర్లు చెప్పారు. హైరిస్క్ కేసులను ప్రత్యేకంగా పరీక్షించి సుఖప్రసవానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతినెలా మందులు తీసుకునేలా పర్యవేక్షించాలన్నారు. ప్రత్యేక ఎలక్ట్రానిక్ హెల్త్ కార్డుపై ఒపికి వచ్చిన వారిని ల్యాబ్‌లో చేసిన పరీక్షలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, కాన్పులు పిహెచ్‌సిలో ఎక్కువగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమాల్లో తహశీల్దార్ టి.విజయకుమార్, ఎంఇఒ నాగేశ్వర్, డిప్యూటీ తహశీల్దార్ సతీష్, ఎన్‌సిడి ప్రాజెక్టు అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు, వైద్యులు డాక్టర్ అనూష్, డాక్టర్ శాంతి, పాల్గొన్నారు.

ఎపిజిఎల్ఐ సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవితబీమా ఎపిజిఎల్ఐ కార్యాలయంలో లోన్లు, బాండ్ల చెల్లింపులలో జాప్యాన్ని నివారించి, నగదు చెల్లింపులకు తగు చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ కోరారు. గురువారం ఎపిజిఎల్ఐ ప్రాంతీయ కార్యాలయ జెడి. డి.అశోక్‌కు యుటిఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోన్లు, క్లోజర్ల దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, దీని వల్ల ఉపాధ్యాయులు అవసరానికి చేతికి డబ్బులు రాక అవస్థలు పడుతున్నారని చెప్పారు. కొత్త వెబ్‌సైట్‌లో ఖాతాలు తప్పుల తడకలు ఉన్నాయని, వీటిని వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. ఖాతాలు అప్ టూ డేట్ చేస్తే అవసరమున్న వారు కొత్తగా దరఖాస్తు చేసుకుంటారని అన్నారు. జెడి స్పందిస్తూ ఈ అంశాల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.పోతురాజు, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు మూర్తి పాల్గొన్నారు.



జేడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు



నీట మునిగిన పొలాలు.. పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు (ఇన్‌సెట్)

అధికారుల నిర్లక్ష్యంతో పొలాలు మునక

వర్షపు నీటితో ముంపుబారిన పడ్డ పొలాలను పరిశీలించిన రైతు సంఘం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

డ్రెయినేజి వ్యవస్థ నిర్వహణలో లోపం, అధికారుల అలసత్వం కారణంగా వర్షపు నీరు పొలాలను ముంచెత్తిందని, ఇది రైతులకు తీవ్ర నష్టమని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు అన్నారు. తెనాలి గోలి డొంకలో నీట మునిగిన పొలాలను రైతు సంఘం నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ నేలపాడు, తేలప్రోలు, గోలిడొంక పరిసర ప్రాంతాల్లో ఐదెకరాల్లో వెద పద్ధతిలో సాగు చేసిన వరి నీట మునిగిందన్నారు. ఖరీఫ్ ఆరంభంలోనే మురుగు కాల్వల్లో పూడికలు, గుర్రపు డెక్క, తూటి కాడను తొలిగించి ఉంటే, డ్రెయినేజీ కాల్వల్లో నీటి పారుదల సక్రమంగా ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పారు. పంట కాల్వలకు అనుసంధానమైన డ్రెయినేజి కాల్వల్లో పూడికలను యుద్ధ ప్రాతిపదికన తొలిగించాలన్నారు. తాజాగా రైతులకు వాటిల్లిన నష్టంపై సత్వరమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ, నీటి పారుదల శాఖ అధికారులకు వినతి పత్రాలిచ్చామన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ వెద పద్ధతిలో సాగునారంభించిన రైతులకు ఖరీఫ్ ఆరంభంలోనే ఎకరాకు రూ.10 వేలు చొప్పున నష్టం చవిచూడటం బాధాకరమన్నారు. కాల్వల్లో పేరుకుపోయిన తూటికాడ, గుర్రపు డెక్కను తొలిగింపజేస్తామని అధికారులు చెప్పినా చేయించలేదని విమర్శించారు. పరిశీలనలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జె.బాలరాజు, నాయకులు బి.అమ్మిరెడ్డి, బ్రహ్మేశ్వరరావు, గోపిరెడ్డి పాల్గొన్నారు.